క్లుప్తంగా

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్‌లపై కఠిన చర్యలు



స్కూల్ బస్‌ను తనిఖీ చేస్తున్న ఎంవీఐ మాధవరావు

బేస్తవారిపేట: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్‌లపై కఠిన చర్యలు తప్పవని మార్కాపురం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మాధవరావు హెచ్చరించారు. మంగళవారం బేస్తవారిపేటలో ప్రైవేట్ స్కూల్ బస్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బస్సులో ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికెట్, మెడికల్ కిట్, ఫైర్ సిలిండర్ తప్పనిసరిగా ఉండాలని డ్రైవర్లకు సూచనలిచ్చారు. ట్యాక్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని ఓ స్కూల్ బస్‌కు రూ.1,69,040 జరిమానా విధించారు. వాహనాన్ని సీజ్ చేసి బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి



మృతి చెందిన శంకర్‌రెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని ఖాజీపురం గ్రామానికి చెందిన సూరం శంకర్ రెడ్డి(57) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. పూసలపాడు మోడల్ ప్రైమరీ స్కూల్లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన అర్ధరాత్రి వేళ గుండెపోటుకు గురవడంతో గిద్దలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శంకర్‌రెడ్డి భౌతికకాయానికి ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్యులకు ఘన సన్మానం



కంభంలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కంభం: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను ఘనంగా సన్మానించారు. జబ్బుల నుంచి ఉపశమనం, ప్రమాదాల నుంచి ప్రాణ రక్షణ కల్పించే వైద్య వృత్తి ఎంతో గొప్పదని, వైద్యులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వక్తలు పేర్కొన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని, వైద్యులు శ్రీదేవి, శివనాయక్, పద్మావతిబాయి, శ్రావ్య, ఫణికిషోర్, శేఖర్ నాయక్‌ను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తన్నీరు బాలరంగారావు, కార్యదర్శి వెంకట్రావు, కోశాధికారి గుండయ్య, సీనియర్ సభ్యులు పులి శ్రీనివాస ప్రసాద్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల రక్తదానం



మార్కాపురంలో రక్తదానం చేస్తున్న డాక్టర్లు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో డాక్టర్స్‌డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 15 మంది డాక్టర్లు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న రోగులకు సేవలు అందిస్తూ, ప్రాణాలు కాపాడుతున్న వైద్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. వైద్యులు లేని సమాజం ఊహించలేమన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు, ప్రిన్సిపాల్ మారుతీదేవి, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణీంద్రారెడ్డి, డాక్టర్ ఎం.రాంబాబు, డాక్టర్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన 11 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరగాయలు కొనలేం.. తినలేం!

- ధరలు పెరిగిపోవడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- వర్షాలులేక స్థానికంగా మొదలుకాని కూరగాయల సాగు
- బెంగళూరు నుంచి పశ్చిమ ప్రకాశానికి దిగుమతి

కూరగాయల రకం	ప్రస్తుత ధర	10 రోజుల క్రితం ధర
బీన్స్	120	100
చిక్కుడు	80	60
క్యాప్సికం	80	60
క్యారట్	70	55
కాకర	60	45
బీట్‌రూట్	60	50
బీర	60	45
దొండ	50	40
మిర్చి	50	40
బెండ	50	40
టమోట	30	20



మార్కాపురం: కూరగాయల ధరలు కొండెక్కాయి. 100 రూపాయల నోటు తీసుకుని మార్కెట్‌కు వెళ్తే కనీసం 2 రోజులకు సరిపడా కూరగాయలు కూడా రావడం లేదు. వర్షాకాలం ప్రారంభమైనా సక్రమంగా వానలు కురవకపోవడంతో కూరగాయల సాగు ప్రారంభం కాలేదు. మిర్చి, క్యారెట్, బీట్‌రూట్, బీన్స్, క్యాబేజీ, క్యాప్సికం తదితర కూరగయాలన్నీ బెంగుళూరు నుంచి పశ్చిమ ప్రకాశంలోని మార్కెట్లకు దిగుమతి అవుతున్నాయి. దీంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 10 రోజుల వ్యవధిలో కూరగాయల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. అసలే జూన్ నెల కావడంతో ప్రతి కుటుంబంలో విద్యార్థుల ఫీజులు, పుస్తకాలు తల్లిదండ్రులకు అదనపు ఖర్చు కాగా కూరగాయల ధరలు కూడా పెరగడంతో మరింత భారంగా మారింది.

మార్కాపురం కూరగాయల మార్కెట్ నుంచి రోజూ త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దోర్నాల, శ్రీశైలం, పెద్దారవీడుకు తరలివెళ్తుంటాయి. మార్కాపురంలో రైతు బజారు లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకే వినియోగదారులు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కాపురంలో రైతు బజారు ఏర్పాటు చేసినట్లయితే రైతులు నేరుగా మార్కెట్‌కు తీసుకొచ్చి ఆశించిన లాభంతో వినియోగదారులకు కూరగాయలు అమ్ముకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే ఇష్టారాజ్యంగా మారింది. కూరగాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. స్థానికంగా పండే కూరగాయలు ఆగస్టు నెలాఖరు నాటికి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ధరలపై నియంత్రణ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, తాత్కాలికంగానైనా రైతు బజారు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ



గిద్దలూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది



కంభంలో ర్యాలీలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఏడీఈ శేషగిరిరావు సూచించారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏడీఈ కార్యాలయం నుంచి గణేష్‌నగర్, పొట్టి శ్రీరాములసెంటర్, రైల్వేస్టేషన రోడ్డు, కుమ్మరాంకట్టసెంటర్ మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రధానంగా విద్యుత్ పరికరాలకు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. విద్యుత్‌ను ఆదా చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన పరికరాలను కొనుగోలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈలు నారాయణరెడ్డి, వెంకటేశ్వరరావు, విద్యుత్ లైన్‌మెన్లు, కాశయ్య, నాయక్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం: జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కంభంలో విద్యుత్ శాఖాధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగించే సమయంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లో బోర్ల వద్ద తడి చేతులతో స్విచ్చులు వేయకూడదని, పొలాల కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకూడదని, ఫ్యూజులను సొంతంగా వేసుకోకూడదని రైతులకు సూచించారు. గృహాల్లో హీటర్ వాడే సమయంలో స్విచ్ ఆఫ్ చేయకుండా నీటిని తాకరాదని, ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్ ఉపకరణాలను మాత్రమే వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ నర్సయ్య, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం: మార్కాపురం పట్టణ, పరిసర మండలాల్లోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్లు ఈ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ ఏడీ బాలాజీ నాయక్ సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డీలర్లు రోజూ డీబీటీ అప్‌డేట్ చేసుకోవాలని, పంపిణీ ఇన్‌వాయిస్‌ను ప్రింట్‌తీసి షాపులో ఉంచుకోవాలన్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తామని, ఏవైనా తేడాలుంటే 6ఏ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. లాట్ నెంబరుతో విత్తనాల బిల్లులను రైతులకు ఇవ్వాలని స్పష్టం చేశారు. డీబీటీ యంత్రాలు ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. రైతులు ఎరువును వాపస్ ఇచ్చినట్లయితే అదే రోజు క్యాన్సిల్ చేసే అవకాశం ఉందన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఓ బుజ్జిబాయి, టెక్నికల్ ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, డీలర్లు పాల్గొన్నారు.

ధృమ వారాహిగా జగదాంబ అమ్మవారు



ధృమ వారాహి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

మార్కాపురం టౌన్: స్థానిక మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారు మంగళవారం ధృమ వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూల విగ్రహమూర్తిని ఆలయ అర్చకులు ఆంజనేయ ప్రసాద్, వరుణ్‌తేజ బృందం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గిద్దలూరు రూరల్: ఈ నెల 9వ తేదీన జాతీయ స్థాయి కార్మికుల సమ్మె నేపథ్యంలో పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు పి.స్వర్ణకుమారి, మున్నా మాట్లాడుతూ.. కార్మికులకు నష్టం చేకూర్చే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైరైన అంగన్‌వాడీ వర్కర్లకు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. 9న నిర్వహించే సమ్మెకు గిద్దలూరు ప్రాజెక్టులోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ సభ్యులు రమణమ్మ, రత్నం, సారమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం టౌన్: సమస్యల పరిష్కార సాధనలో భాగంగా మార్కాపురంలో మున్సిపల్ కార్మికులు మంగళవారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరికృష్ణ, ఇమాంసా మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు నెలకు 21 వేల రూపాయల జీతం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఏ క్షణంలోనైనా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు.

గిద్దలూరులో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వినియోగదారుల సంఘం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వీరారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని వినియోగదారుల సంఘం కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశిరెడ్డినాయన కుంట వద్ద పిల్లలకు ఉపయోగపడే వ్యాయామ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. రాచర్ల గేటు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రజలు ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. పొట్టి శ్రీరాములు సెంటర్ సమీపంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గుంతలమయమైన సిమెంట్ రోడ్డును బాగు చేయాలని కోరారు. పట్టణంలో సర్వీస్ ఆటోలను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం టౌన్: డివిజన్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ ఎన్.అరుణ తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా మార్కాపురంలోని సహాయ సాంఘిక సంక్షేమ కార్యాలయానికి పంపాలని సూచించారు. షెడ్యూల్ కులాలు, తెగలు, సామాజిక సేవా దృక్పథం, పౌరహక్కుల చట్టం, హత్యా నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీలు అర్హులని స్పష్టం చేశారు. మాన్యువల్ స్కావెంజర్ కమిటీ ఏర్పాటుకు కూడా అర్హులైన సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు అనర్హులని తెలిపారు.

వృద్ధులు ప‘రేషన్’!



కొమరోలులో రేషన్ బియ్యం మోసుకెళ్తున్న వృద్ధులు

కొమరోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించే ప్రక్రియను కూటమి ప్రభుత్వం ఇటీవల నిలిపేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ బియ్యం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వ ఆదేశాలు ఒకటీఅరా దుకాణాల డీలర్లు తప్ప మిగిలిన వారు పాటించడం లేదు. జూలై నెలకు సంబంధించిన రేషన్ సరుకులను 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు గత నెల 26వ తేదీ నుంచి డీలర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి అందించినట్లు కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. మంగళవారం నుంచి రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభం కాగా, కొమరోలులో వృద్ధులు దుకాణాల వద్దకు క్యూకట్టారు. బియ్యం మూటలు నెత్తిన పెట్టుకుని ఊతకర్ర సహాయంతో ఇంటిబాట పట్టారు. ఇంటి వద్దకు బియ్యం తెచ్చివ్వకపోవడంతో తామే వచ్చి తీసుకెళ్తున్నామని కొమరోలు బీసీ కాలనీకి చెందిన ఓబులమ్మ, చిన్నప్ప తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది

మార్కాపురం: డెంగీ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నాగేంద్రరెడ్డి సూచించారు. మంగళవారం జాతీయ డెంగీ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జెడ్పీ బాలుర హైస్కూల్లో సదస్సు అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ.. దోమల బారి నుంచి కాపాడుకునేందుకు స్వీయరక్షణ చర్యలు చేపట్టాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంటిముందు చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో దోమలు పెరగకుండా కిరోసిన్ లేదా దోమల మందులు పిచికారీ చేయాలని, జ్వరాలు వచ్చిన వారు రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఎల్ రమేష్‌బాబు, వీరారెడ్డి, దామోదర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ సిబ్బంది సత్యనారాయణ, కాశయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంతో కూడిన మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి


- సబ్ కలెక్టర్‌కు గౌడ సంఘం నాయకుల వినతి




సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గౌడ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: శ్రీశైలం, సున్నిపెంట ప్రాంతాలతో కలిపి మార్కాపురం నూతన జిల్లా ఏర్పాటు చేయాలని డివిజన్‌లోని గౌడ సంఘ నాయకులు మంగళవారం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. వెలుగొండ ప్రాజెక్టు నీటి సరఫరా నిమిత్తం కొల్లంవాగు పరిసరాల్లో ఉన్న హెడ్ రెగ్యులేటర్‌ను నంద్యాల జిల్లా అటవీశాఖ పరిధి నుంచి తప్పించి మార్కాపురం డీఎఫ్ఓ పరిధిలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా కేంద్రానికి శ్రీశైలం సుమారు 160 కిలోమీటర్ల దూరం ఉందని, అదే మార్కాపురానికి అయితే కేవలం 80 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్నందున శ్రీశైలం, సున్నిపెంటను మార్కాపురం జిల్లాలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లక్షలాది మందికి జీవనాధారమైన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వచ్చే తాగు, సాగునీటికి సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వానికి నివేదికలు పంపాలని విన్నవించారు. కార్యక్రమంలో మార్కాపురం గౌడ సంఘ అధ్యక్షుడు రంగస్వామి గౌడ్, నాయకులు లక్ష్మయ్య గౌడ్, నాగార్జునగౌడ్, విజయభాస్కర్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, శ్రీనివాసగౌడ్, సతీష్‌గౌడ్, రంగారావు గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో ముసురు



మార్కాపురం ప్రాంతంలో ఆకాశాన్ని కమ్మేసిన కారుమేఘాలు



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మార్కాపురంలోని ఓ ప్రాంతంలో అలుముకున్న చీకటి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి ముసురుపట్టింది. రాత్రి 7 గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షం కురిస్తే ఖరీఫ్ పంట సాగు ప్రారంభించాలని ఎదురు చూస్తున్నారు. కాగా, చిరుజల్లులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.పట్టణంతోపాటు పరిసర గ్రామాలైన వేములకోట, చింతగుంట్ల, దరిమడుగు, రాయవరం తదితర ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

